క్లుప్తంగా

అమ్మవార్లకు విశేషంగా తిరువీధి



తిరువీధిలో అమ్మవార్ల ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో కొలువుదీరిన సింహవల్లీ తాయారు, చతుర్భుజ తాయారు అమ్మవార్లకు శుక్రవారం విశేషంగా తిరువీధి జరిగింది. అమ్మవార్ల ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించి పల్లకిలో వేంజేపచేశారు. సాయంత్రం ఆలయ బేడామండపంలో తిరువీధి నిర్వహించారు. హారతులు అందించారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాత తీగల రవీంద్రబాబు తరఫున బాండ్ అందుకుంటున్న సురేంద్రస్వామి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి గుంటూరులోని కన్నవారితోట నివాసి, విశ్రాంత అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ తీగల రవీంద్రబాబు, నాగేశ్వరమ్మ దంపతులు రూ.లక్ష విరాళమిచ్చారు. సంబంధిత విరాళాన్ని డీడీ రూపంలో దేవస్థానానికి పంపించారు. దాతకు ఇవ్వాల్సిన బాండ్‌ను సింహాచలం ప్రాంతానికి చెందిన పోలీస్ కానిస్టేబుల్, సింహాద్రి మఠం గురుస్వామి కశిరెడ్డి సురేంద్రస్వామికి దేవస్థానం సూపరింటెండెంట్ సునీల్ అందించారు.

రాష్ట్ర స్థాయి టెన్నీకాయిట్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రామకృష్ణ, తదితరులు

సబ్బవరం: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి టెన్నీకాయిట్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి పి.సాగర్, ఇంటర్ ఫస్టియర్ విద్యార్థి అభిలాష్‌లు అనకాపల్లి జిల్లా తరఫున ఎంపికై రాష్ట్రస్థాయి సీనియర్ విభాగంలో ఆడనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రస్థాయి పోటీలు ఈ నెల 13, 14 తేదీల్లో కోనసీమ జిల్లా మండపేటలో జరుగుతాయన్నారు. ప్రిన్సిపాల్‌తో పాటు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ సీఎల్ఎన్ ప్రసాద్, పీఈటీ వి.సూర్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ కె.చిరంజీవిరావు, ఉపాధ్యాయులు రాంబాబు, వెంకటరావు తదితరులు విద్యార్థులను అభినందించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌ల పంపిణీ



సీఎంఆర్ఎఫ్ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి: నియోజకవర్గ పరిధిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న పలువురికి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్‌లను పంపిణీ చేశారు. సుజాతనగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో వాటిని చికిత్స పొందుతున్న వారి కుటుంబ సభ్యులకు అందించారు.

- జీవీఎంసీ జోన్-8 ఇన్‌చార్జి జోనల్ కమిషనర్(జెడ్సీ)గా బాధ్యతలు స్వీకరించిన శంకరరావు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

రాంపురం గణపతి సన్నిధిలో అన్నసమారాధన



వినాయకుడ్ని దర్శించుకుంటున్న గండి బాబ్జీ, భక్తులు

పెందుర్తి: మండలంలోని రాంపురంలో సాఫ్ట్‌వేర్ బాయ్స్ యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. మధ్యాహ్నం అన్నసమారాధనలో దాదాపు 2 వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు. ఏపీ ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ముత్యాలమ్మపాలెం తీరం.. అభివృద్ధికి దూరం!



ముత్యాలమ్మపాలెం తీరంలో పర్యాటక శాఖ గుర్తించిన ప్రభుత్వ స్థలం



బోటు షికారుకు అనువైన ఉప్పుటేరు

- కనీస వసతులూ కరువైన వైనం
- గత ప్రతిపాదనలు బుట్టదాఖలు
- తగ్గుతున్న పర్యాటకుల సందడి

ప్రకృతి అందాలతో పర్యాటకుల్ని ఆకట్టుకునే ముత్యాలమ్మపాలెం తీరం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. కనీస వసతులూ లేక సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారు. ఒకసారి వచ్చిన వాళ్లు.. మళ్లీ వచ్చేందుకు ఆసక్తి చూపని పరిస్థితి. గతంలో పర్యాటకశాఖ తీరంలో పలు సౌకర్యాల ఏర్పాటుకు స్థలాన్ని ఎంపిక చేసింది. ఏయే వసతులు కల్పించాలో అధ్యయనం కూడా చేసింది. ఎందుకనో ఆ ప్రతిపాదనలు అమలుకు నోచుకోలేదు. దీంతో ఇప్పటికీ తీరంలో నిలువ నీడలేక సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారు.

పరవాడ: సువిశాల తీర ప్రాంతం. పక్కనే బోటింగ్‌కు అనువైన ఉప్పుటేరు. చుట్టూ పచ్చని కొండలు, జీడిమామిడి తోటలు, ఇసుక తిన్నెలు. ఆట పాటలకు అనువైన క్రీడా మైదానం.. ఇన్ని వనరుల నిలయం ముత్యాలమ్మపాలెం తీరప్రాంతం. ఏటా జరిగే కార్తీక మాసం, మాఘ పౌర్ణమి తీర్థ మహోత్సవాల్లో పుణ్య స్నానాలు ఆచరించేందుకు విశాఖ, అనకాపల్లి జిల్లాల నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తారు. వీకెండ్స్, సెలవు రోజుల్లో పర్యాటకుల సందడి సరేసరి. అయితే తీరానికి చేరుకున్నాక ఇక్కడ కనీస వసతులూ లేక సందర్శకులు పెదవి విరుస్తున్నారు.

తీరం విశాలం.. రవాణా అనుకూలం

ముత్యాలమ్మపాలెం తీరానికి చేరుకునేందుకు విశాలమైన రోడ్డు మార్గం, ఆర్టీసీ బస్సు, ఆటో సర్వీస్‌లు పుష్కలం. లోతు తక్కువగా ఉండడం, పెద్దగా ప్రమాదాలకు తావులేని తీరప్రాంతం కావడంతో పర్యాటకులు ఎక్కువగా వస్తుంటారు. పర్వదినాల్లో భక్తులు సముద్రస్నానాలకు ఇక్కడికి వచ్చేందుకే ఆసక్తి చూపిస్తారు. ఈ తీరం సినిమా షూటింగ్‌లకూ చాలా అనువైనది. గతంలో ఇక్కడ పలు సినిమాలను చిత్రీకరించిన సందర్భాలూ ఉన్నాయి.

ప్రతిపాదనలకే పరిమితం

ఇక్కడి తీరప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ఏడేళ్ల క్రితం పర్యాటక శాఖ తీరంలోని సర్వే నెం.324/2లో 12.52 ఎకరాల స్థలాన్ని ఎంపిక చేసింది. ఆ స్థలంలో పర్యాటకులకు కల్పించాల్సిన సదుపాయాలపై పర్యాటక శాఖ బృందం తీరంలో పర్యటించి ఏయే వసతులు కల్పిస్తే బాగుంటుందన్న అంశాలపై అధ్యయనం చేసింది. ఇది జరిగి ఏళ్లు గడుస్తున్నా.. ఇప్పటికీ అది కార్యాచరణకు నోచుకోలేదు. దీంతో తీరంలో సరైన వసతుల్లేక సందర్శకులు కూడా రాకపోకలు తగ్గించేశారు.

కనీస వసతులూ కరువే..

తీరంలో కనీస సదుపాయాల్లేక పర్యాటకుల తాకిడి రోజు రోజుకీ తగ్గుతోందని స్థానికులు చెప్తున్నారు. ఎండావానల నుంచి రక్షణ పొందడానికి షెల్టర్లు, తీరంలో సేదదీరేందుకు అవసరమైన సిమెంటు బల్లలు, మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక గదులు, తాగునీటి సదుపాయం కల్పించాల్సి ఉంది. ఆట పాటలకు అవసరమైన ఆట స్థలాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. ఉప్పుటేరులో బోటు షికారు కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయొచ్చు. తీరం వెంబడి విద్యుత్ దీపాల ఏర్పాటు ద్వారా మరింత అభివృద్ధికి ఆస్కారం ఉంటుంది. ఇప్పటికైనా ప్రభుత్వం, పర్యాటక శాఖ ఆ దిశగా చర్యలు చేపట్టాలని పర్యాటకులు కోరుతున్నారు.



తీరంలో ఆటలకు అనువైన క్రీడా మైదానం



విశాలమైన తీరంలో పర్యాటకుల సందడి

పర్యాటకంగా అభివృద్ధి చేయాలి



ప్రకృతి సిద్ధ వనరులు తీరంలో పుష్కలంగా ఉన్నాయి. చుట్టూ పచ్చని కొండలు, పంట పొలాలు, బోటు షికారుకు అవసరమైన ఉప్పుటేరు, క్రీడలకు వీలుగా ఆట స్థలం, విశాలమైన తీరం సందర్శకుల్ని ఇట్టే ఆకట్టుకుంటాయి. అయినా దీన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసే దిశగా ఎవరూ పట్టించుకోవట్లేదు. ఇప్పటికైనా తీరాన్ని పర్యాటక పరంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలి.

– మైలపల్లి అప్పారావు, స్థానికుడు

వసతులు కల్పించాలి



ముత్యాలమ్మపాలెం తీరంలో కనీస వసతులు లేక పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మహిళలు దుస్తులు మార్చుకునేందుకు అనువైన ఏర్పాట్లు కూడా లేవు. అవసర సమయంలో రక్షణ కోసం షెల్టర్లు, తాగునీటి వసతి, కూర్చునేందుకు బల్లలు ఏర్పాటు చేస్తే బాగుంటుంది. తీరంలో వసతులు కల్పిస్తే సందర్శకులు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి.

– పైల శ్రీనివాసరావు, సందర్శకుడు

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై కొలువుంచారు. ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయ దాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రంలను అందించారు.

అప్పన్న సన్నిధిలో ఒడిశా మంత్రి దిలీప్ రే



దిలీప్ రేకు అప్పన్న చిత్రపటాన్ని అందిస్తున్న సత్యశ్రీనివాస్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని మాజీ కేంద్రమంత్రి, ఒడిశా రాష్ట్ర మంత్రి దిలీప్ రే సతీసమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అంతరాలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు జరిపారు. వేద ఆశీర్వచనం అనంతరం ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదాన్ని సూపరింటెండెంట్ సత్య శ్రీనివాస్ అందించారు.

చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం

పెందుర్తి: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నామని జిల్లా విద్యాశాఖాధికారి(ఇన్‌చార్జి) ఎ.సోమేశ్వరరావు అన్నారు. స్థానిక పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలంలోని వ్యాయామ విద్య ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో చదువుతో పాటు వ్యాయామం కూడా అంతే అవసరం అన్నారు. క్రీడల వలన శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసం కలుగుతుందన్నారు. త్వరలో 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల, డివిజనల్, ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయిలో 53 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆ దిశగా విద్యార్థులకు పీఈటీలు తర్ఫీదునివ్వాలని సూచించారు. పలు అంశాలపై చర్చించారు. సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ చంద్రశేఖర్, ఎంఈవో-1 కె.సువర్ణ, ఎంఈవో-2 మధుమూర్తి, జీహెచ్ఎస్ హెచ్ఎం సీహెచ్ చిన్నమ్మాయి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ డీఈవో సోమేశ్వరరావు

దుర్గా నవరాత్రి ఉత్సవాలకు పందిరి రాట



పెందుర్తి జూనియర్ కళాశాల వద్ద పందిరి రాట వేస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు



పెదముషిడివాడ దుర్గమాంబ పందిరి రాట వేడుకలో గ్రామ పెద్దలు

పెందుర్తి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. పండితుల వేదమంత్రోచ్ఛరణల నడుమ శాస్త్రోక్తంగా పందిరి రాట వేశారు. ఈ నెల 22న అమ్మవారి విగ్రహం ప్రతిష్ఠించి పూజలు ప్రారంభించనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

పరవాడ: వచ్చే నెల 2న నిర్వహించనున్న దుర్గమాంబ మహోత్సవాలను పురస్కరించుకుని పెదముషిడివాడలో అమ్మవారి పందిరిరాట శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పల్లా నాగమణి, వైఎస్సార్‌సీపీ నాయకులు పల్లా కబడ్డీ అప్పారావు, యలమర్తి బుజ్జి, స్థానిక నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

అంతర్జాతీయ వేదికపై భువన కల్యాణి ప్రతిభ

సింహాచలం: శంకర్ ఫౌండేషన్‌లోని సమర్థ కాలేజ్ ఆఫ్ ఆప్టోమెట్రీ అకడమిక్ ఇన్‌చార్జ్ భువన కల్యాణికి అరుదైన గౌరవం దక్కిందని డీజీఎం బంగార్రాజు శుక్రవారం మీడియాకు తెలిపారు. ఈ నెల 8 నుంచి 12 వరకు ఇటలీలో జరిగిన విజన్ రీసెర్చ్ అండ్ రీహాబిలిటేషన్ 15వ అంతర్జాతీయ సమావేశంలో ఆమెకు ప్రతిష్టాత్మకమైన పురస్కారం లభించిందన్నారు. ఆప్టోమెట్రీ, దృష్టి పునరావాస రంగంలో ప్రపంచంలో ప్రముఖ నిపుణుల్లో ఒకరిగా ఆమెకు ఈ అవార్డు దక్కిందన్నారు. కంటి సంరక్షణ, నిర్వహణలో వినూత్న విధానాలపై ఆమె ఇచ్చిన ప్రదర్శన అంతర్జాతీయ ప్రతినిధుల అభినందనలు అందుకున్నట్లు తెలిపారు. భువన కల్యాణిని ఆస్పత్రి మేనేజింగ్ ట్రస్టీ ఎ.కృష్ణకుమార్, జనరల్ మేనేజర్ కె.రాధాకృష్ణన్, మెడికల్ ఎడ్యుకేషన్ హెడ్ ప్రొఫెసర్ పి.కృష్ణప్రసాద్, అధ్యాపక సభ్యులు అభినందించారు



ప్రశంసా పత్రం అందుకుంటున్న భువన కల్యాణి

ముగ్గురు ద్విచక్ర వాహన దొంగల అరెస్ట్

పెందుర్తి: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో ద్విచక్ర వాహన చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు దొంగలను క్రైం విభాగం పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి రూ.5 లక్షల విలువైన మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో క్రైం విభాగం ఎస్ఐ డి.సూరిబాబు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. కృష్ణరాయపురంలోని సాయి మహల్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న ఉమ్మిడిశెట్టి భవానీశంకర్ తన రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌ను అపార్ట్‌మెంట్ ముందు ఈ నెల 2న రాత్రి పార్కింగ్ చేశాడు. మరుసటి రోజు వాహనం కనిపించకపోవడంతో తీవ్రంగా గాలించాడు. ఫలితం లేకపోవడంతో 8న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెస్ట్ జోన్ క్రైం విభాగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టిన ఎస్ఐ సూరిబాబు బృందం కేసును చాకచక్యంగా ఛేదించింది. ముద్దాయిలు విజయనగరం జిల్లా ఎస్ కోట సమీపంలోని ధర్మవరం గ్రామానికి చెంది కుక్కల మణికంత, వేపాడ మండలం వల్లంపూడికి చెందిన కవల జ్ఞానేంద్రసాయి అలియాస్ సాయి, కణితి భానుప్రకాష్ అలియాస్ భానులుగా గుర్తించారు. శుక్రవారం ఉదయం వారి నుంచి భవానీశంకర్‌కు చెందిన రాయల్ ఎన్‌ఫీల్డ్‌తో పాటు మరొకటి, ఇంకో ఎఫ్ జెడ్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. కేసులో ప్రతిభ కనబరిచిన ఎస్ఐ సూరిబాబు, ప్రొహిబిషన్ ఎస్ఐలు వి.చినబాబు, షేక్ జిలానీ, ఏఎస్ఐ కె.శ్రీనివాసరావు, హెచ్‌సీ వి.పేరయ్యానాయుడు, పీసీలు టి.శివప్రసాద్, బి.దేముడునాయుడు, ఎల్‌కే తాతారావులను ఉన్నతాధికారులు అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న క్రైం విభాగం ఎస్ఐ సూరిబాబు

తీరు మార్చుకోని అధికారుల్ని ఉపేక్షించేది లేదు

- మండిపడ్డ ఎమ్మెల్యే పంచకర్ల
- యూరియా కొరతపై నిలదీసిన సభ్యులు
- వాడీవేడిగా సబ్బవరం మండల సర్వసభ్య సమావేశం

సబ్బవరం: అధికారులు విధి నిర్వహణలో తీరు మార్చుకోవాలని, లేకుంటే ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. యూరియా కొరతపై రైతులు, ప్రతిపక్షాలు కావాలనే కూటమి ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. యూరియా కొరత ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే రైతులకు అందుబాటులో ఉంచుతామన్నారు. పలు శాఖల పనితీరుపై సమీక్షించి మూడు నెలల క్రితం సర్వసభ్య సమావేశంలో తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలపై అధికారులను ఆరాతీసి, పనితీరు సరిగా లేదని అసహనం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అవసరమైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, నిర్లక్ష్యం వహించే చర్యలు తప్పవన్నారు.

సమావేశంలో వైస్ ఎంపీపీలు దాడి ఝాన్సీలక్ష్మీరాణి, మామిడి లక్ష్మి, ఎంపీడీవో పద్మజ, తహసీల్దార్ బి.చిన్నికృష్ణతో పాటు పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

నిలదీసిన సభ్యులు

- అసకపల్లి కొండ గ్రావెల్‌ను అక్రమంగా తవ్వకుంటున్నారని, తమ పంచాయతీ అభివృద్ధి పనులకు కావాల్సిన గ్రావెల్‌కు అధికారులు అనుమతించడం లేదని అసకపల్లి ఎంపీటీసీ కర్రి అప్పారావు సభ దృష్టికి తీసుకెళ్లారు.
- పాలిశెట్టి సురేష్‌రాజ్ మాట్లాడుతూ కూటమి నేతలు, అధికారులు యూరియా కొరత లేదని ఊదరగొడుతున్నారని, తీరా రైతులు రైతు సేవా కేంద్రాలకు, ప్రైవేట్ డీలర్ల వద్దకు వెళ్తే స్టాక్ లేదంటూ వెనక్కి పంపిస్తున్నారని ఆక్షేపించారు. గత ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలను రైతు ముంగిట్లోకే కొరత లేకుండా పంపిణీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు.
- ప్రభుత్వం రైతులకు అవసరమైన యూరియా ఇవ్వలేక, సరైన సమాధానం చెప్పలేక మోతాదుకు మించి వినియోగిస్తున్నారని కథలు చెప్పడం సరి కాదని.. బైలపూడి రామారావు ఆక్షేపించారు.

రోడ్ సేఫ్టీపై పోలీసులకు శిక్షణ



మాట్లాడుతున్న డీఎస్పీ విష్ణుస్వరూప్

పరవాడ: రోడ్డు ప్రమాదాల నివారణ, నియంత్రణలో శాస్త్రీయ సమాచార సేకరణ కీలకమని పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ అన్నారు. అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు పరవాడ ఫార్మాసిటీలోని రాంకీ హబ్‌లో జిల్లా పోలీస్ ఐటీ కోర్‌టీం, కలెక్టరేట్ బృందం సమన్వయంతో రోడ్ సేఫ్టీ శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల రైటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు అపలు అంశాల్లో శిక్షణ ఇచ్చారు. మేనేజ్‌మెంట్ విధానాలు, డేటా ఎంట్రీ, కేసు రిజిస్ట్రేషన్, రోడ్డు ప్రమాదాల వివరాల నమోదు వంటి అంశాలపై ప్రాక్టికల్ శిక్షణ కల్పించారు. కార్యక్రమంలో పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు, ఎస్ఐ బి.కృష్ణారావు, సిబ్బంది పాల్గొన్నారు.

అదనపు పనిభారం తగ్గించాలి



మండల పరిషత్ కార్యాలయంలో ఏవో వెంకట్రావుకు వినతిపత్రం అందిస్తున్న గ్రామ సచివాలయ ఉద్యోగులు

- డోర్ టూ డోర్ సర్వే నుంచి తక్షణమే మినహాయింపు ఇవ్వాలి
- రెండు వారాల్లో సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం తీవ్రతరం
- ప్రభుత్వానికి గ్రామ/వార్డు సచివాలయాల ఉద్యోగుల అల్టిమేటం

పెందుర్తి: వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజలకు అవగాహన కలిగిస్తూ, డోర్ టూ డోర్ సర్వే బాధ్యతలు తమకు అప్పగించడం దారుణమని గ్రామ/వార్డు సచివాలయాల ఉద్యోగులు ఆక్షేపించారు. కార్యాలయాల్లో విధుల భారమే అధికంగా ఉంటే సర్వే పేరిట ఇంటింటికీ తిరగాలనడం సరికాదన్నారు. రాష్ట్ర గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ పిలుపు మేరకు శుక్రవారం పెందుర్తి గ్రామీణ, పట్టణ ప్రాంతాల సచివాలయ ఉద్యోగులు అధికారులకు వినతిపత్రాలు అందించారు. మండలంలోని 9 గ్రామ సచివాలయాల ఉద్యోగులు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏవో కొల్లి వెంకట్రావుకు, జీవీఎంసీ జోన్-8 పరిధిలోని వార్డు సచివాలయ ఉద్యోగులు వేపగుంటలోని జోన్-8 కార్యాలయంలో ఇన్‌చార్జ్ జోనల్ కమిషనర్ శంకరరావుకు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగ సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ సచివాలయాల పరిధిలో ఇప్పటికే అనేక సేవలు ప్రజలకు అందించడంలో తలమునకలై ఉంటున్నామన్నారు. తాజాగా ఈ సర్వే పని ఒత్తిడి పెరిగి తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని వాపోయారు. తక్షణమే ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే రెండు వారాల్లో తమ భవిష్యత్ కార్యాచరణ రూపొందించి ఉద్యమ బాట పడతామని హెచ్చరించారు. జోన్-8 సచివాలయ ఉద్యోగుల జేఏసీ ప్రతినిధులు బండారు శ్రీనివాస్, ఎస్.పార్థసారథి, ఆర్.రమేష్, భార్గవి, చైతన్య, ఎ.శివ తదితరులు పాల్గొన్నారు.



జెడ్సీ శంకరరావుకు వినతిపత్రం అందిస్తున్న వార్డు సచివాలయాల ఉద్యోగులు

వెంకన్నకు అభిషేకాలు

పెందుర్తి: స్థానిక వేంకటాద్రిపై కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి సుప్రభాతసేవ జరిపారు. అనంతరం విశేష అభిషేకాలు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

దేశం గర్వించదగ్గ నేత సీతారాం ఏచూరి



సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న సిటు నాయకులు

పరవాడ: సీతారాం ఏచూరి దేశం గర్వించదగ్గ నాయకుడని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు కొనియాడారు. సిటు నాయకుడు గనిశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన ఫార్మాసిటీలో శుక్రవారం జరిగిన సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏచూరి ఉత్తమ పార్లమెంటేరియన్‌గా, దేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పార్లమెంట్‌లో పరిష్కార మార్గాలు చూపిన నాయకుడిగా అందరి మన్ననలు పొందారన్నారు. ఆయన నమ్మిన సిద్ధాంతాల్ని ముందుకు తీసుకెళ్లడమే ఆయనకిచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో కె.పోతినాయుడు, పి.పోతినాయుడు, డి.దేముడు, పైడిరాజు, చిన్నారావు, కనకారావు పాల్గొన్నారు.